సాక్షి విజయనగరం

శుక్రవారం । 14 । మార్చి । 2025



నిద్ర కరువైతే అనారోగ్యం..!

అధికంగా మొబైల్ వాడడం, టీవీ ఎక్కువగా చూడడం వల్ల అధికశాతం మంది నిద్రలేమి బారిన పడుతున్నారు.

- 8లో



ఆకతాయిల ఆట కట్టించేందుకు 'శక్తి' టీమ్స్

ఆకతాయిల ఆట కట్టించేందుకు 'శక్తి' టీమ్స్‌ను ఏర్పాటు చేశామని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు.

- 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శుక్ర (సా)	శని(ఉ)
6.11	4.42

న్యూస్‌రీల్

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు వెబ్ ఆప్షన్

విజయనగరం టౌన్: డీఎస్సీ ఉచిత శిక్షణకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు వెబ్ ఆప్షన్ సర్వీస్‌ను జ్ఞానభూమి, ఎమ్‌డీఎఫ్‌సీ డాట్ ఏపీసీఎఫ్‌ఎస్‌ఎస్. డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్టు జిల్లా షెడ్యూల్ కుల ముల సంక్షేమం, సాధికారత అధికారి బి.రామానందం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 15వ తేదీలోపు వారి లాగిన్‌లో కోచింగ్ సెంటర్ పేరు, ప్రాధాన్యత వారీగా వెబ్ ఆప్షన్స్ ఇవ్వాలన్నారు.

బదిలీ కౌన్సెలింగ్‌ను మాన్యువల్‌గా నిర్వహించాలి

- పీఆర్‌టీయూ జిల్లా కమిటీ డిమాండ్



మాట్లాడుతున్న సంఘ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాయుడు

విజయనగరం అర్బన్: వేసవి సెలవుల్లో చేపట్టబోయే ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియను ఆన్‌లైన్‌లో కాకుండా మాన్యువల్‌గా నిర్వహించాలని పీఆర్‌టీయూ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సంఘ జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి రవీంద్రనాయుడు మాట్లాడారు. 8 ఏళ్లు సర్వీసు నిండిన వారు బదిలీలు తప్పనిసరి చేసుకోవాల్సి ఉంటుందని, ఆన్‌లైన్ విధానం వల్ల వారికి ఇబ్బందని తెలిపారు. తప్పనిసరి బదిలీ ఉపాధ్యాయులు దాదాపు 1,500 మంది వరకు ఉన్నారని, ఆన్‌లైన్ విధానంలో ఆప్షన్స్ పెట్టుకోవడం కష్టతరమని, అన్యాయం జరిగే అవకాశాలే ఎక్కువన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ రావాడ రాంబాబు, ఉత్తరాంధ్ర మీడియా ఇన్‌చార్జి బంకపల్లి శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తెలుగులో తొలి రచయిత్రి మొల్లమాంబ



మొల్లమాంబకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: తెలుగులో తొలి కావ్యం రచించిన రచయిత్రి మొల్లమాంబని, ఆమె చరిత్ర భావితరాలకు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. మొల్లమాంబ జయంతిని బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం నిర్వహించారు. తొలుత జ్యోతిని వెలిగించి మొల్లమాంబ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ వాల్మీకి రామాయణాన్ని సరళమైన తెలుగు భాషలో రచించిన ఘనత మొల్లమాంబదేనన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జేసీ శ్రీనివాసమూర్తి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి పెంటోజీరావు, డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి, కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లి అప్పలనాయుడు, బీసీ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.



తమ్ముళ్ల చేతిలో.. చంపావతి చెర



ఇసుక కోసం చంపావతి నది ఒడ్డును తవ్వేస్తున్నారిలా...

- గజపతినగరం నియోజకవర్గంలో భారీఎత్తున ఇసుక అక్రమ తవ్వకాలు
- టీడీపీ నాయకుల అండదండలతో చెలరేగుతున్న అక్రమార్కులు
- నిలువెత్తు గోతులతో ఛిద్రమవుతున్న నదీ తీరం
- కరిగిపోతున్న ఇరువైపులా కట్టలు
- కొద్ది రోజుల్లోనే రూ.కోట్లకు పడగలెత్తిన ఇసుకాసురులు
- కన్నెత్తి చూడని ప్రభుత్వాధికారులు



ఇసుక తవ్వకాలతో రూపుకోల్పోతున్న చంపావతి

సాక్షి ప్రతినిధి, విజయనగరం/గజపతినగరం రూరల్: సాక్షాత్తూ మంత్రి కొండపల్లి శ్రీనువాస్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం.. ఆయన తండ్రి కొండబాబు కనుసన్నల్లో నడుస్తున్న యంత్రాగం.. వారు కోరితెచ్చుకున్న అధికారులు.. ఇదే అదనుగా టీడీపీ నాయకులు కొందరు చంపావతి నదిని చెరబట్టారు. ఇసుకాసురులతో చేతులు కలిపి ఇసుక మేటలను కొల్లగొడుతున్నారు. రాత్రీ పగలు తేడాలేకుండా ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్నారు. తవ్వినంత ఎత్తిపోసుకోవడానికి వీలుగా ఉన్న కూటమి ప్రభుత్వ నూతన ఇసుక విధానం వారికి అన్నివిధాలా కలిసి వస్తోంది. అదే సాకుతో అధికారులెవ్వరూ అటువైపు కన్నెత్తి చూడట్లేదు. ఫలితం ఇసుకను దోచుకుంటున్నవారు కొద్ది రోజుల్లోనే కోట్ల రూపాయలకు పడగలెత్తారు. వారికి అనుకూలమైన అధికారులకు ఆమ్యామ్యాలు ముడుతున్నాయనే ఆరోపణలు ఎలాగూ ఉన్నాయి. చంపావతి నది మాత్రం ఇసుకాసురుల కబంధహస్తాల్లో చిక్కి రూపురేఖలే కోల్పోతోంది. వరద సమయంలో రక్షణగా ఉండే కట్టలు కరిగిపోతుండడం తీర ప్రాంత ప్రజల్లో వణుకుపుట్టిస్తోంది. దాహం తీరుస్తున్న రక్షిత మంచినీటి పథకాలకు పెను ప్రమాదం పొంచి ఉంది.

అనుమతి లేకుండానే తవ్వకాలు

గజపతినగరం మండలంలో వాస్తవానికి ఎక్కడా అధికారికంగా ఇసుక ర్యాంపులకు అనుమతి లేదు. కానీ చంపావతికి ఉపనది ఏడొంపుల గెడ్డలో తొలుత ఇసుక తవ్వకాలు మొదలెట్టారు. ఎం.గుమడాం, లింగాలవలస గ్రామాల వద్ద ఇష్టారీతిలో తవ్వేస్తున్నారు. రోజుకు కనీసం 150 ట్రాక్టర్ల ఇసుకను తరలించేస్తున్నారంటే పరిస్థితి ఊహించవచ్చు. తర్వాత ఇదే మండలం పరిధిలోనున్న చంపావతి నదీ పరివాహక ప్రాంతాలైన మర్రివలస, చిట్టేయవలస, కొణిశ, గంగచోళ్లపెంట, పత్రువాడ, దావాలపేట, పురిటిపెంట, లోగిశ, సీతారామపురం తదితర గ్రామాల్లో పెద్ద ఎత్తున ఇసుకను తవ్వేస్తున్నారు.

లారీలకు లోడులెత్తి...

ట్రాక్టర్లతో తెస్తున్న ఇసుకను గజపతినగరం పరిసర ప్రాంతాల్లో కుప్పలేస్తున్నారు. రాత్రిపూట ఆ ఇసుకను లారీలకు ఎత్తి విశాఖపట్నం, ఒడిశా ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఒక్కో లారీ ఇసుకకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకూ వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఇది లాభసాటిగా ఉండడంతో టీడీపీ నాయకులు ఇసుకాసురులతో చేతులు కలిపి ప్రకృతిని, ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారు.

అధికారుల ఉదాసీనత...

కళ్ల ముందే ఇసుక ట్రాక్టర్లతో ఇష్టానుసారం తరలిపోతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడట్లేదు. రెవెన్యూ, పోలీస్ శాఖల్లోనూ ఎక్కువ మంది టీడీపీ నేతలు కోరితెచ్చుకున్న వారే కావడంతో వారికి తొత్తులుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇదే ఇప్పుడు ఇసుక దోపిడీదారులకు కలిసివస్తోంది. కొంతమంది అధికారులకూ దండిగా మామ్మూళ్లు అందుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకవేళ ఎవరైనా అధికారి అడ్డగించినా వారిపై స్థానిక ప్రజాప్రతినిధి తండ్రికి ఫిర్యాదులు వెళ్లిపోతున్నాయట. ఇప్పటికైనా ఇసుక దోపిడీని నియంత్రించకపోతే చంపావతి భవిష్యత్తులో చంపేనది అవుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.



ట్రాక్టర్లతో ఇసుక తరలింపు

పోలిపల్లి పైడితల్లి జాతర ఆదాయం ▶ రూ. 26.60లక్షలు

రాజాం సిటీ: స్థానిక పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర ఆదాయం రూ.26,60,714లు వచ్చినట్టు ఈఓ బీవీ మాధవరావు తెలిపారు. ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు జరిగిన జాతరలో వచ్చిన ఆదాయాన్ని ఆలయంలో గురువారం లెక్కించారు. ప్రత్యేక దర్శనం టిక్కెట్ల అమ్మకంతో రూ.3,88,850లు, మొక్కుబడుల రూపంలో రూ.2,66,700లు, శీఘ్రదర్శనం టికెట్ల నుంచి రూ.3,05,000లు, లడ్డూ ప్రసాదం విక్రయంతో రూ. 2,21,760లు, పులిహోర ప్రసాదం నుంచి రూ.1,31,900లు, హుండీల నుంచి రూ.12,85,646లు, విరాళాల రూపంలో రూ.60,858లు సమకూరిందని ఈఓ తెలిపారు. గతేడాది 22,63,571లు రాగా ఈ ఏడాది అదనంగా 3,97,143లు వచ్చినట్టు వెల్లడించారు. లెక్కింపు కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌ప్రసాద్, నవదుర్గ ఆలయ ఈఓ పి.శ్యామలరావు, ఆలయ ట్రస్టీ వాకచర్ల దుర్గాప్రసాద్, అర్చకులు వేమకోటి సూర్యనారాయణశర్మ, సలాది తులసీదాస్, వెంపల లక్ష్మణరావు, పోలీసు సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



జాతర ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

'ఉపాధి' తీసేయొద్దు బాబూ..



ఉపాధిహామీ పనుల్లో టీడీపీ నేతలు రాజకీయం చేస్తున్నారు.. ఎలాంటి సమాచారం లేకుండా ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన మేట్‌ను తొలగించారు.. 49 మంది వేతనదారులకు పని కల్పించడం లేదు.. ఇదెక్కడి అన్యాయమంటూ విజయనగరం మండలం కొండకరకాం గ్రామంలోని ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వేతనదారులు గురువారం విజయనగరం ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. మేట్‌గా నరవ సత్యవతిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. తమకు జరిగిన అన్యాయాన్ని ఎంపీడీఓకు వివరించి వినతిపత్రం అందజేశారు. పని కల్పించకుండా ఇబ్బంది పెడుతున్న ఫీల్డు అసిస్టెంట్ చింతపల్లి అప్పలస్వామిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ మామిడి అప్పలనాయుడు వేతనదారులతో మాట్లాడారు. న్యాయం చేస్తానని చెప్పారు.

- విజయనగరం

రోడ్డెక్కిన పోలీస్ అభ్యర్థులు



కోర్టులో ఉన్న హోంగార్డుల రిజర్వేషన్ కేసును వేగంగా పరిష్కరించి కానిస్టేబుల్ మెయిన్ ఎగ్జామ్ నిర్వహించాలని కోరుతూ పోలీస్ అభ్యర్థులు గురువారం ఆందోళన చేశారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) ఆధ్వర్యంలో ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మెయిన్ పరీక్ష కోసం 95,208 మంది అభ్యర్థులు ఎదురు చూస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదంటూ మండిపడ్డారు. పరీక్ష నిర్వహణలో జాప్యంతో రైతు కుటుంబాల నుంచి చదువుకోసం పట్టణానికి వచ్చిన అభ్యర్థులమంతా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సీహెచ్ హరీష్, ప్రతినిధులు నాగరాజు, వినోద్, శంకర్, రాము, భానుప్రసాద్, 50 మంది కానిస్టేబుల్ అభ్యర్థులు పాల్గొన్నారు.

- విజయనగరం గంటస్తంభం

77 జీఓ రద్దుకు డిమాండ్

విజయనగరం గంటస్తంభం: జీవో నంబర్ 77 రద్దుచేసి పీజీ విద్యార్థులకు న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పూడి రామ్మోహన్ డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ విజయనగరం డిగ్రీ కళాశాల విద్యార్థులు మయూరి కూడలి నుంచి కాంప్లెక్స్ వరకు గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ కామన్ పీజీ ఎంట్రన్స్ టెస్ట్ రద్దుచేసి యూనివర్సిటీలకు స్వయం ప్రతిపత్తి హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విస్మరిస్తోందన్నారు. తక్షణమే రూ.3,680 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి డి.రాము, సీహెచ్. వెంకటేష్‌లు మాట్లాడుతూ ఉపకార వేతనాలు విడుదల కాక జిల్లాలో డిగ్రీ కళాశాల విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫీజులు చెల్లించకపోవడంతో కళాశాలల్లో హాల్‌టికెట్స్ ఇచ్చే పరిస్థితి లేదని, దీనికి రాష్ట్ర ప్రభుత్వమే కారణమని విమర్శించారు. గతంలో డిగ్రీ రిలీవ్ అయిన విద్యార్థులు వేల సంఖ్యలో పీజీ జాయిన్ అయ్యేవారని, జీవో నంబర్ 77 మూలంగా ఉపకార వేతనాలు రాక డిగ్రీ తర్వాత చదువు ఆపేస్తున్నారన్నారు. వెటర్నరీ విద్యార్థులకు స్టైఫండ్‌ను రూ.25 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు ఈనెల 15న విజయవాడలో తలపెట్టిన నిరసన దీక్షను జయప్రదం చేయాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జె.రవికుమార్, జగదీష్, రమేష్, జిల్లా సహాయ కార్యదర్శి శిరీషా, రాజు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి కాంప్లెక్స్ వద్ద ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

15న ఎంఆర్ కళాశాలలో జాబ్ మేళా

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, మహారాజ అటానమస్ డిగ్రీ కళాశాల సంయుక్తంగా ఈ నెల 15న ఎంఆర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ఆ సంస్థ జిల్లా మేనేజర్ జి.ప్రశాంత్ కుమార్ తెలిపారు. బీటెక్, ఎంటెక్, బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీసీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ ఉత్తీర్ణులైన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ వివరాలను 'నైపుణ్యం.ఏపీ.జీఓవీ.ఐఎన్' వెబ్ సైట్‌లో నమోదు చేసుకొని అడ్మిట్ కార్డుతో పాటు బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్, జెరాక్స్, పాస్‌ఫొటోతో ఆ రోజు ఉదయం 9 గంటలకు హాజరుకావాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం సెల్: 80994 61303, 99888 53335 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రంగుల వేడుక... కారాదు విషాద గీతిక

- నేడు హోలీ
- రంగులతో జరభద్రం

విజయనగరం: హోలీ పండగ అంటేనే రంగులలో మునిగి తేలడం. పిల్లలు, యువత, మహిళలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడుపుతారు. ఒక్క రంగు చల్లడంతో మొదలయ్యే హంగామా.. వింత వింత రంగులు పులుముకునే వరకు వెళ్తుంది. ఆనందం హద్దులు దాటుతున్న కొద్దీ.. హోలీ తీరు కూడా మారిపోతుంటుంది. సరిగ్గా ఇలాంటి సమయంలోనే ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే 'రంగు పడుద్ది' అని హెచ్చరిస్తున్నారు వైద్య నిపుణులు.

- హోలీ సందర్భంగా వినియోగించే కృత్రిమ సింథటిక్ రంగులు మనిషి శరీరంపై ప్రభావం చూపుతాయి. అంతేకాక ఈ రంగులు కళ్లల్లో పడితే కంటి చూపును కోల్పోయే ప్రమాదం ఉంటుందన్నది నేత్ర వైద్యుల మాట. రంగులు చల్లుకునే సమయంలో అత్యుత్సాహం ప్రదర్శించకుంటే హోలీ ఆనందహేళి అవుతుంది. రసాయన రంగులతో కాకుండా సహజ సిద్ధమైన రంగులతో హోలీ ఆడితే ఎలాంటి ఇబ్బందులు ఉండవు.
- రసాయనాలతో తయారు చేసిన రంగులు మనిషిపై పడితే చర్మ సంబంధిత వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. ప్రధానంగా లెడ్ ఆక్సైడ్, అల్యూమినియం, బ్రొమైడ్, మెర్క్యూరీ సల్ఫేట్ వంటి వాటిని కలిపి తయారు చేసే రంగులు చాలా ప్రమాదాన్ని కలిగిస్తాయి.
- రసాయనాలతో కలిపిన రంగులతో హోలీ ఆడితే శరీరంపై రంగులు ఎక్కువ సమయం ఉంచకుండా చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి.
- హోలీ సందర్భంగా ఎరుపు, పింక్ రంగులను వాడితే మంచిది. ఎందుకంటే ఈ రంగులు శరీరం నుంచి సులభంగా తొలగిపోతాయి.
- గ్రీన్, ఎల్లో, ఆరెంజ్ రంగులు ఎక్కువ రసాయనాలను కలిగి ఉంటాయి. అందువల్ల ఆ రంగులు శరీరం నుంచి సులభంగా తొలగిపోవు.
- హోలీ ఆడటానికి ముందు శరీరానికి మాయిశ్చరైజర్ని, తలకు నూనె రాసుకోవాలి. దీనివల్ల రంగులు శరీరంలోకి త్వరగా ఇంకవు. శుభ్రం చేసుకోవడం సులభం.

చిన్నపిల్లలను రంగులకు దూరంగా ఉంచాలి

చాలా మంది సరదాకోసం హోలీ పండగ సందర్భంగా చిన్నపిల్లలకు కూడా రంగులు రాస్తారు. అయితే, చిన్నపిల్లల శరీరం లేతగా ఉండడం వల్ల రసాయనాలతో తయారు చేసిన రంగులు పిల్లల చర్మంపై వెంటనే ప్రభావం చూపుతాయి. ఇక కళ్లల్లో రంగులు పడితే ఆ ప్రభావం తీవ్రంగా ఉంటుంది. అందువల్ల పిల్లలను హోలీ సందర్భంగా రంగులకు దూరంగా ఉంచితే చాలా మంచిది.

- శ్రీనివాసరావు, చిన్న పిల్లల వైద్య నిపుణుడు



సంకల్పానికి సలామ్!

- మాదవ ద్రవ్యాల నియంత్రణలో జిల్లా పోలీస్‌శాఖ ముందడుగు
- నెరవేరుతున్న ఎస్పీ వకుల్‌జిందల్ 'సంకల్పం'
- డ్రగ్స్ కట్టడిలో దేశ వ్యాప్త గుర్తింపు
- వరించిన స్కోచ్ అవార్డు



విజయనగరం క్రైమ్: జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు పోలీస్ శాఖ తలపెట్టిన 'సంకల్పం' నెరవేరుతోంది. ఓ వైపు మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులు, యువతలో చైతన్యం కలిగిస్తున్నారు. ప్రత్యేక ప్రచార రథంతో ఊరూరా తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. మరోవైపు మాదక ద్రవ్యాల రవాణా, విక్రయం, వినియోగించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా పోలీస్ శాఖ పనితీరుకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. స్కోచ్ అవార్డు వరించింది. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందల్ 'సాక్షి'తో గురువారం ప్రత్యేకంగా మాట్లాడారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, మాదక ద్రవ్యాల నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఆయన మాటల్లోనే...

- కరోనా సమయంలో అప్పటి ఎస్పీ బి.రాజకుమారి ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ శాఖ ప్రజలకు అందించిన సేవలకు స్కోచ్ అవార్డు వచ్చింది. మళ్లీ ఇప్పుడు మాదక ద్రవ్యాల నియంత్రణకు పోలీస్ శాఖ చేపట్టిన 'సంకల్పం'కు దేశ స్థాయిలో గుర్తింపు లభించింది. వివిధ రాష్ట్రాల్లో పోలీసులు డ్రగ్స్ నియంత్రణకు చేపడుతున్న చర్యలను పరిశీలించారు. చివరకు విజయనగరం జిల్లా పోలీస్‌శాఖ చేపట్టిన 'సంకల్పం' కార్యక్రమాలతో సంతృప్తి చెంది, ప్రతిష్ఠాత్మకమైన స్కోచ్ అవార్డుకు ఎంపిక చేశారు.
- మాదక ద్రవ్యాలకు అలవాటుపడిన యువతలో మార్పు తీసుకొని వచ్చి, వారిని తిరిగి సన్మార్గంలో నడపాలన్నదే మా 'సంకల్పం'. మాదక ద్రవ్యాల అలవాటుతో విద్యార్థుల భవిష్యత్తు ఏవిధంగా నాశనం అవుతున్నది విద్యార్థులకు వివరిస్తున్నాం. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం. డీ అడిక్షన్ సెంటర్లకు పంపించి చికిత్స అందిస్తున్నాం.
- కళాశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేసి మాదక ద్రవ్యాల అలవాటు ఉన్న విద్యార్థులను గుర్తిస్తున్నాం. వారి పరివర్తనలో మార్పు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం.

కేసుల నమోదు..

గత ఏడాది కాలంలో 62 కేసులు నమోదు చేసి 1656.990 కిలోల గంజాయి, 70 గ్రాముల నల్లమందు స్వాధీనం చేసుకున్నాం. 218 మందిని అరెస్టు చేశాం. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 24 కేసులు నమోదు చేసి 265.626 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని, 65 మందిని అరెస్టు చేశాం. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న 54 గ్యాంగ్‌లను గుర్తించాం. వీరిలో 34 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారు.

- మాదక ద్రవ్యాల మత్తులో మానవ సంబంధాలు విచ్ఛిన్నమవుతున్నాయి. ఆరోగ్యం దెబ్బతింటోంది. విద్యార్థులు చదువుకు చెక్ చెబుతున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిందితులుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. పిల్లల నడతపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టిపెట్టాలి. మంచి చెడులు వివరించి సన్మార్గంలో పెట్టాలి.
- మాదక ద్రవ్యాల అలవాటు ఉన్న విద్యార్థుల సమాచారం, వారికి డ్రగ్స్ ఎక్కడ నుంచి సరఫరా అవుతుందన్న విషయాలు తెలుసుకునేందుకు కళాశాలలో డ్రాప్ బాక్సులను ఏర్పాటు చేస్తున్నాం. నిందితులను పట్టుకుంటున్నాం.

విస్తృత అవగాహన

జిల్లా వ్యాప్తంగా 2011 'సంకల్పం' కార్యక్రమాలను నిర్వహించాం. 1,18,000 మంది ప్రజలకు అవగాహన కల్పించి, 45,150 కర పత్రాలను పంచి పెట్టాం. కళాశాలలు, బహిరంగ ప్రదేశాల్లో 119 డ్రాప్ బాక్సులు, 98 హోర్డింగ్‌లను ఏర్పాటుచేశాం. జిల్లా వ్యాప్తంగా 632 కళాశాలలు/స్కూల్స్‌ను సందర్శించి సంకల్పం కార్యక్రమ ఉద్దేశాన్ని వివరించాం. జిల్లా వ్యాప్తంగా సంకల్ప రథంతో 87 స్కూల్స్‌ను సందర్శించి, 18,042 మంది విద్యార్థులకు అవగాహన కల్పించాం. 103 గ్రామాల్లో నిర్వహించిన ప్రదర్శనలతో 8,975 మందికి మాదక ద్రవ్యాలపట్ల అవగాహన కల్పించినట్టు ఎస్పీ వకుల్ జిందల్ వివరించారు. స్కాచ్ అవార్డు పోలీస్‌శాఖ సమష్టికృషిక నిదర్శనమని వివరించారు.

క్లుప్తంగా

సురక్షితంగా డ్రైవింగ్ చేయాలి

• కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



శిక్షణ పొందిన డ్రైవర్లతో కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: డ్రైవింగ్ నేర్చుకున్న వారంతా సురక్షితంగా డ్రైవింగ్ చేయాలని అలాగే రహదారి భద్రత కోసం అమలులో ఉన్న నియమాలను పాటించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్ సూచించారు. జీఎంఆర్ సంస్థ సీఎస్ఆర్ కింద భోగాపురం మండలం గూడెపువలస, ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన యువతకు లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో నెల రోజుల పాటు 50 మంది యువకులకు శిక్షణ ఇచ్చింది. ఈ శిక్షణ పొందిన వారికి కలెక్టర్ చేతుల మీదుగా గురువారం ఆయన చాంబర్‌లో సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి, ఏఎల్‌డీఎం వైడీ ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

నిర్బంధించిన పశువులను కాపాడిన పోలీసులు



అక్రమంగా నిర్బంధించిన పశువులు

కొత్తవలస: మండలంలోని సంతపాలెం గ్రామం శివారు మామిడి తోటలో అక్రమంగా నిర్బంధించిన 171 పశువులను సీఐ సీహెచ్.షణ్ముఖరావు ఆధ్వర్యంలో పోలీసులు గురువారం కాపాడారు. ఆ పశువులను ఇక్కడికి తీసుకొచ్చి వధించి వేరే చోటకు మాంసాన్ని తరలించేందుకు సిద్ధంగా ఉన్నాయని అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా పశువులను అక్రమంగా నిర్బంధించిన ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఆ పశువులను ప్రస్తుతానికి అక్కడే ఉంచామని కోర్టు ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని సీఐ చెప్పారు.

చలో విజయవాడను విజయవంతం చేయండి

• మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర అధ్యక్షురాలు స్రవంతి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న స్రవంతి తదితరులు

విజయనగరం గంటస్తంభం: మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 19న విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన పథకం (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షురాలు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.స్రవంతి పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆమె పట్టణంలోని పలు పాఠశాలల్లో ఉన్న మధ్యాహ్న భోజన పథక కార్మికులకు కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అనేక ఇబ్బందులు పడుతూ కేవలం సేవా దృక్పథంతో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథక కార్మికులు ఎన్ని ప్రభుత్వాలు మారినా నేటికీ అన్యాయానికి గురవుతున్నారన్నారు. ఈనెల 19 జరిగే చలో విజయవాడ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న మధ్యాహ్న భోజన పథక కార్మికులంతా హాజరవాలని కోరారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి కె.రాజి పాల్గొన్నారు


విజయీభవ



పులివెందులలో కబడ్డీ పోటీలకు వెళ్తున్న జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సబ్ జూనియర్స్ బాల, బాలికల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లు విజేతలుగా తిరిగి రావాలని జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కేవీ.ప్రభావతి ఆకాంక్షించారు. ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు కడప జిల్లా పులివెందులలో జరగనున్న అంతర్ జిల్లాల పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులు గురువారం పయనమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా జట్టులోకి అర్హత సాధించిన క్రీడాకారులకు ఆమె పలు సూచనలు చేశారు. కృషి, పట్టుదల, నిరంతర శిక్షణ ఉంటే ఏ రంగంలోనైనా రాణించగల సామర్థ్యం దక్కించుకోవచ్చని చెప్పారు. విజయనగరం జిల్లా కబడ్డీ, ఖోఖో క్రీడలకు పెట్టింది పేరుగా ఖ్యాతినర్జించిందని, అదే తరహాలో సబ్‌జూనియర్స్ పోటీల్లో వర్ధమాన క్రీడాకారులు రాణించాలని ఆకాంక్షించారు.

నిద్ర కరువైతే అనారోగ్యం..!



ఓఎస్‌పి మిషన్ పెట్టుకుని నిద్రపోతున్న గురక సమస్య ఉన్న వ్యక్తి



చాలామంది నిద్రలేమి సమస్య బారిన పడుతున్నారు. అయితే ఈసమస్యకు ఎవరిని సంప్రదించాలో చాలామందికి తెలియదు. పలమనాలజిస్టునుగాని, ఈఎన్‌టీ వైద్యుడిని గానీ సంప్రదించాలి. ఆరోగ్యంగా జీవించడం కోసం రోజులో 6 నుంచి 7 గంటల పాటు నిద్రపోవాలి. సెల్‌ఫోన్ ఎక్కువగా వినియోగించకూడదు. అదేవిధంగా టీవీ కూడా గంటల తరబడి చూడకూడదు.

డాక్టర్ బొత్స సంతోష్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

• పెరుగుతున్న నిద్రలేమి సమస్య
• నిద్రలేమితో బీపీ, సుగర్, గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే ఆస్కారం
• మొబైల్, టీవీలు అతిగా చూడడం వల్ల సమస్య

విజయనగరం ఫోర్ట్: మానవుని జీవనశైలిలో మార్పులు, అధికంగా మొబైల్ వాడడం, టీవీ ఎక్కువగా చూడడం వల్ల అధికశాతం మంది నిద్రలేమి బారిన పడుతున్నారు. ఎక్కువసేపు ఒకే చోట కూర్చుని పనిచేయడం, జంక్‌ఫుడ్స్ ఎక్కువగా తినడం, రాత్రివేళ ఆలస్యంగా నిద్రపోవడం, రాత్రి షిఫ్టుల్లో విధులు నిర్వహించడం వల్ల తగినంత నిద్ర ఉండదు. దీని వల్ల వారు బీపీ, సుగర్, ఊబకాయం, గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్, థైరాయిడ్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. శుక్రవారం ప్రపంచ నిద్ర దినోత్సవం సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం. చాలా మంది నిద్ర లేకపోతే ఏం జరుగుతుంది? అని తేలికగా తీసుకుంటారు. అర్ధరాత్రి వరకు చాలా మంది నిద్రపోరు. దీని వల్ల



నిద్రలేమి సమస్య ఉన్న వ్యక్తిని పరీక్షిస్తున్న వైద్యుడు

అనేక సమస్యల బారిన పడతారు. నిద్రలేమి వల్ల ఓఎస్‌ఏ (అబ్స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా) అనే సమస్యకు గురవుతారు. ఈ సమస్య ఉన్న వ్యక్తి శ్వాస తీసుకోవడం పదేపదే ఆగిపోవడం, ఊపిరి లోతుగా తీసుకోవడం (అల్పశ్వాస) జరుగుతుంది. అదే విధంగా పెద్దగా గురక పెట్టడం, శ్వాస పునఃప్రారంభం అయినప్పుడు ఉక్కిరిబిక్కిరి అయి వింత శబ్దాలు రావడం, పగటి సమయంలో మధ్యమధ్య కునుకుపాట్లు పడుతూ ఉండడం, అలసటగాను, మత్తుగాను ఉంటుంది. మద్యం తాగడం, పొగతాగడం, స్థూలకాయం వల్ల ఓఎస్‌ఏ సమస్య తీవ్రతరం అవుతుంది. చిన్నపిల్లల్లో అయితే ఎదుగుదల ఉండదు. మానసిక సమస్యల బారిన పడతారు.నెలకు 1000 మంది వరకు నిద్ర లేమి సమస్య బారిన పడుతున్నారు.

6నుంచి 7 గంటల నిద్ర అవసరం

ప్రతి వ్యక్తి రోజులో 6 నుంచి 7 గంటలు నిద్రపోవాలి. ఇలా నిద్ర పోవడం వల్ల హార్మోన్స్ తయారవుతాయి. ఒత్తిడి తగ్గుతుంది. పనిచేయడానికి అవసరమైన శక్తి తయారవుతుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది. శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంటుంది.

జాగ్రత్తలు

నిద్రలేమి సమస్య బారిన పడకుండా ఉండాలంటే ప్రతిరోజూ వ్యాయమం చేయాలి. కనీసం రోజులో 6 గంటలు నిద్ర పోవాలి. నిద్రలేమి సమస్య ఉన్నట్లయితే పలమనాలజిస్టునుగాని, ఈఎన్‌టీ వైద్యుడిని గాని సంప్రదించాలి. ఊబకాయం రాకుండా చూసుకోవాలి. పానీపూరీ, చాట్, పిజ్జా, బర్గర్లు వంటివి ఎక్కువగా తినకూడదు.

ఆకతాయిల ఆట కట్టించేందుకు 'శక్తి' టీమ్స్

• ఐదు బృందాలుగా 30మందితో టీమ్స్
• ఒక్కో బృందానికి ఒక్కో ఎస్సై నాయకత్వం
• టీమ్స్ పనితీరు చూసేందుకు అదనపు ఎస్పీ నియామకం



శక్తి టీమ్స్‌కు దిశానిర్దేశం చేస్తున్న ఎస్పీ వకుల్ జిందల్, ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం క్రైమ్: ఆకతాయిల ఆట కట్టించేందుకు 'శక్తి' టీమ్స్‌ను ఏర్పాటు చేశామని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. జిల్లాలో మహిళలపై జరుగుతున్న దాడులు, ఆకతాయిల వేధింపులను నియంత్రించేందుకు, మహిళలకు రక్షణగా నిలిచే చట్టాలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'శక్తి' యాప్ పట్ల అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు శక్తి టీమ్స్‌ను నియమించామని తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసిన శక్తి టీమ్స్‌తో ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం మమేకమై, వారు నిర్వర్తించే విధులు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. ఈ శక్తి టీమ్స్ జిల్లాలోని కళాశాలలు, ముఖ్య కూడళ్లను మఫ్టీలో సందర్శించి, మహిళలను వేధించే ఆకతాయిలను గుర్తించి, వారిపై చట్టపరమైన చర్యలు చేపడతారన్నారు. విజయనగరం, బొబ్బిలి, రాజాంలలో ఆరుగురు పోలీసు సిబ్బందితో ఐదు బృందాలుగా 30మందితో శక్తి టీమ్స్ ఏర్పాటు చేశామని, ఒక్కో బృందానికి ఒక్కో ఎస్సై నాయకత్వం వహిస్తారని చెప్పారు. ఈ బృందాలు మఫ్టీలో విధులు నిర్వహిస్తారని తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన శక్తి టీమ్స్ కోసం గతంలో ప్రత్యేకంగా కేటాయించిన ద్విచక్రవాహనాలను, ఫోర్ వీలర్స్ పెట్రోలింగ్ వాహనాలను వినియోగించాలని సూచించారు. ఆపద సమయంలో శక్తి యాప్‌కు వచ్చే ఎస్‌ఓఎస్ కాల్స్, డయల్ 112,100 కాల్స్‌ను బట్టి సంఘటన స్థలంకు వెళ్లే వారు తమతోపాటు ట్యాబ్‌లు కూడా వెంట తీసుకుని వెళ్లాలని, బాడీ వోర్న్ కెమెరాలను ధరించాలని సూచించారు. కాల్స్ వచ్చిన వెంటనే శక్తి బృందాలు అప్రమత్తమై సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకుని సమస్యలను చట్టబద్ధంగా పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందల్ శక్తి టీమ్స్‌ను ఆదేశించారు.

ప్రజల్లో అవగాహన కల్పించాలి

మహిళలకు రక్షణగా ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన శక్తి మొబైల్ యాప్ పట్ల ప్రజల్లో విస్తృతంగా ప్రచారం కల్పించి, వారి మొబైల్స్‌లో యాప్ నిక్షిప్తం చేయడం, రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. ఆపద సమయాల్లో శక్తి యాప్ ఏవిధంగా పని చేస్తుందన్న విషయాన్ని మహిళలకు వివరించాలని కోరారు. ఈ బృందాల పని తీరును జిల్లాలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత పర్యవేక్షిస్తారని, మహిళా పీఎస్ ఇన్‌స్పెక్టర్ నోడల్ అధికారిగా ఉంటారన్నారు. అంతేకాకుండా, శక్తి టీమ్స్ పని తీరును రాష్ట్ర డీజీపీ కార్యాలయం కూడా పర్యవేక్షిస్తుందని, వారి ఆదేశాల మేరకు చేయాల్సి ఉంటుందని శక్తిటీమ్స్‌కు ఎస్పీ దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, మహిళా పీఎస్ సీఐ ఈ.నర్సింహమూర్తి, ఎస్బీ సీఐ ఏవీ లీలారావు, ఆర్ఐ ఎన్.గోపాల నాయుడు, శక్తి టీమ్స్ సభ్యులు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

ఉంగుటూరు: చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై ఆత్కూరు వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయనగరం జిల్లా ఇప్పలవలస గ్రామానికి చెందిన జామి శ్రీనివాసరావు(60) ఆత్కూరులోని మేనల్లుడి కుమార్తె ఓణీల ఫంక్షన్‌కు వచ్చాడు. స్వగ్రామానికి వెళ్లేందుకు జాతీయ రహదారి దాటుతున్న సమయంలో గన్నవరం వైపు నుంచి వస్తున్న ఇన్నోవా కారు ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాసరావును ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు ఏఎస్ఐ రామారావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీలో నూతన నియామకాలు

• జాబితాను విడుదల చేసిన పార్టీ కేంద్ర కార్యాలయం

విజయనగరం: పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా వైఎస్సార్‌సీపీ నూతన నియామకాలు చేపట్టింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపాలిటీ/ మండల పార్టీ అధ్యక్షులను నియమించారు. నూతనంగా నియామకమైన వారి జాబితాను గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. నియోజకవర్గాల వారీగా పార్టీ మండల, మున్సిపాలిటీ అధ్యక్షుల వివరాలు ఇలా ఉన్నాయి..

గజపతినగరం నియోజకవర్గం	
మండలం	నూతన అధ్యక్షుడు
బొండపల్లి	బొద్దల చిన్నంనాయుడు
దత్తిరాజేరు	రాపాక కృష్ణమూర్తి
గజపతినగరం	బూడి వెంకటరావు
గంట్యాడ	జాగారపు అప్పారావు
జామి	గొర్లె రవికుమార్
నెల్లిమర్ల నియోజకవర్గం	
మండలం	నూతన అధ్యక్షుడు
నెల్లిమర్ల నగర పంచాయతీ	చిక్కాల సాంబశివరావు
నెల్లిమర్ల	గదల సన్యాసినాయుడు
పూసపాటిరేగ	పతివాడ అప్పలనాయుడు
భోగాపురం	ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి
డెంకాడ	పిన్నింటి తమ్మునాయుడు
రాజాం నియోజకవర్గం	
మండలం	నూతన అధ్యక్షుడు
రాజాం మున్సిపాలిటీ	పాలవలస శ్రీనివాసరావు
రాజాం	లావేటి రాజగోపాలనాయుడు
రేగడి ఆముదాలవలస	వావిలాపల్లి జగన్‌మోహన్‌రావు
సంతకవిటి	గరుగుబిల్లి స్వామినాయుడు
వంగర	కరణం సుదర్శనరావు

ఎస్‌కోట నియోజకవర్గం	
మండలం	నూతన అధ్యక్షుడు
కొత్తవలస	ఒబ్బిన నాయుడు
ఎల్‌కోట	గుమ్మిడి సత్యనారాయణ
ఎస్‌కోట	మోపాడ డీబీఎస్‌కే కుమార్
వేపాడ	మమ్ములూరి జగన్నాధం
చీపురుపల్లి నియోజకవర్గం	
మండలం	నూతన అధ్యక్షుడు
చీపురుపల్లి	మీసాల వరహాలనాయుడు
గరివిడి	మీసాల విశ్వేశ్వరరావు
మెరకముడిదాం	కోట్ల వెంకటరావు
గుర్ల	పొట్నూరు సన్యాసినాయుడు
బొబ్బిలి నియోజకవర్గం	
మండలం	నూతన అధ్యక్షుడు
బొబ్బిలి మున్సిపాలిటీ	చోడగంజి రమేష్‌నాయుడు
బొబ్బిలి	తమ్మిరెడ్డి దామోదరరావు
తెర్లాం	తెంటు సత్యంనాయుడు
రామభద్రాపురం	అప్పికొండ లక్ష్మునాయుడు
బాడంగి	వేమల శివ ప్రసాదరావు
సాలూరు నియోజకవర్గం	
మండలం	నూతన అధ్యక్షుడు
మెంటాడ	రాయిపల్లి రామారావు

బడిబయట బడిఈడు పిల్లలు

• భిక్షాటన చేస్తూ జీవనయానం
• తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితులే కారణం
• పట్టించుకోని సంబంధిత అధికారులు





రామభద్రపురం: తల్లితో పాటు భిక్షాటన చేస్తున్న బాలుడు.(ఇన్‌సెట్లో) చొక్కాపు వీధిలో భిక్షాటన చేస్తున్న బాలుడు

రామభద్రపురం: ఏ దేవుడు ఈ చిన్నారుల మొర ఆలకిస్తాడు? ఏ అధికారి వీరి దీనస్థితిని పట్టించుకుంటాడు? ఏ నాయకుడు ఈ పిల్లలకు అండగా ఉంటాడు? ఇంటి ఆర్థిక పరిస్థితులు సహకరించక.. ఆటపాటలతో మమేకమవుతూ విద్యను అభ్యసించవలసిన వయసులో ఎందరో బడిఈడు పిల్లలు బడి బయట భిక్షాటన చేస్తున్నారు. అలాగే వీధి పిల్లలుగా, బాలకార్మికులుగా మారుతుండడం దురదృష్టకరం. బడిఈడు పిల్లలు బడికి వెళ్లకుండా వీధులలో, ఆలయాల వద్ద భిక్షాటన చేస్తూ కనబడడంతో ప్రభుత్వ పరిరక్షణ ఇంత దీనస్థితితో ఉందా అంటూ పలువురు విమర్శిస్తున్నారు.బాలల పరిరక్షణ గురించి ప్రభుత్వంతో పాటు సంబంధిత అధికారులు కనీసం పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. కొన్ని కుటుంబాలలో ఆర్థిక, సామాజిక పరిస్థితుల కారణంగా కొంతమంది తల్లిదండ్రులే తమ పిల్లల్ని బలవంతంగా బడిమాన్పించి, భిక్షాటన చేయించడం, ఇంటి పనికో, దుకాణాలకో, మెకానిక్ షెడ్డులకో లేదంటే వ్యవసాయపనులకో పంపిస్తూ బాలకార్మికులుగా మారుస్తున్నారు. ఈ పద్ధతిని మార్చి పిల్లలంతా బడికి వెళ్లేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం, బాలల పరిరక్షణ కమిటీ తీసుకోవాల్సి ఉన్నా పట్టించుకోకుండా విద్యాహక్కు చట్టానికి విఘాతం కలిగిస్తున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ ఉంటే పలువురు చిన్నారులు బహిరంగంగా భిక్షాటన ఎందుకు చేస్తారని, బాలల పరిరక్షణ కమిటీ పర్యవేక్షణ కరువైందని పలువురు విమర్శిస్తున్నారు





రామభద్రపురం: ఆటోలో భిక్షాటనకు బయలుదేరిన బడిఈడు పిల్లలు, (ఇన్‌సెట్లో) వేషం మార్చి యాచన చేస్తున్న విద్యార్థి



రామభద్రపురం: శివాలయం వద్ద భిక్షాటన చేస్తున్న చిన్నారులు

చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం



స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనువాసులు నాయుడు

చీపురుపల్లి రూరల్(గరివిడి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనువాసుల నాయుడు, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు అన్నారు. గరివిడిలో శ్రీ చైతన్య పాఠశాల ఆవరణలో నిర్వహించిన డా.బీఎస్.రావు మెమోరియల్ జోనల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యావిధానంలో ఉన్నత భవిష్యత్తుకు చదువు ఎంత అవసరమో శారీరక, మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు, క్రీడల్లో ఉన్నతంగా రాణించేందుకు క్రీడలు కూడా అంతే అవసరమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కానీ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కానీ మంచి భవిష్యత్తు లక్ష్యంగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీచైతన్య ఉత్తరాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఎంవీ.సురేష్, రీజనల్ ఇన్‌చార్జ్ వి.శ్రీనివాసరావు, రామినాయుడు, కోఆర్డినేటర్‌లు బాలరాజు, వెంకటరమణ, అప్పారావు, మనోరమ, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

ట్రైబల్ పెయింటింగ్ అండ్ ఆర్ట్ కాంపిటీషన్‌లో ప్రతిభ

గుమ్మలక్ష్మీపురం: విశాఖపట్నంలో ఈనెల 12న జరిగిన జన్ జాతీయ గౌరవ దివస్ గిరిజన స్వాభిమాన్ వేడుకలు-2025లో భాగంగా నిర్వహించిన స్టేట్ లెవెల్ ట్రైబల్ పెయింటింగ్ అండ్ ఆర్ట్ కాంపిటీషన్‌లో పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని గిరిజన యువకులు, విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ మేరకు ఈ పోటీల నిర్వహణలో పాల్గొన్న లైజనింగ్ ఆఫీసర్/డ్రాయింగ్ టీచర్ రుగడ శ్రీనివాసరావు గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీనియర్ విభాగంలో గుమ్మలక్ష్మీపురం మండలంలోని తాడికొండ గ్రామానికి చెందిన మండంగి బాలచంద్రుడు వేసిన ఆర్ట్ ప్రథమస్థానం పొందిందని తెలిపారు. ఈ నేపథ్యంలో బాలచంద్రుడుకు రూ.10వేల నగదు ప్రోత్సాహంతో పాటు ప్రశంసాపత్రం, షీల్డ్‌ను నిర్వాహకులు అందజేశారన్నారు. అలాగే ద్వితీయ స్థానం పొందిన గుమ్మలక్ష్మీపురం మండలం టిక్కబాయి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థి ఆరిక రాజేష్‌కు రూ.5వేల నగదుతో పాటు ప్రశంసాపత్రం, షీల్డ్‌ను అందజేశారని, ప్రత్యేక బహుమతులను కురుపాంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు గౌతమ్, అన్వితలకు అందజేశారని పేర్కొన్నారు.



పోటీల్లో గెలుపొంది బహుమతులు అందుకుంటున్న గిరిజన విద్యార్థులు

రాయితీపై వ్యవసాయ యాంత్రీకరణ ఉపకరణాలు

• జిల్లా వ్యవసాయ అధికారి వి.తారక రామారావు

తెర్లాం: వ్యవసాయ యాంత్రీకరణ ఉపకరణాలు అందించేందుకు జిల్లాకు రూ.2.5కోట్ల రాయితీని ప్రభుత్వం ప్రకటించిందని జిల్లా వ్యవసాయ అధికారి వి.తారక రామారావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన తెర్లాం వచ్చిన సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం 50శాతం రాయితీపై పవర్‌స్ప్రేయర్లు, పవర్ టిల్లర్లు, రోటోవేటర్లు, ట్రాక్టరు పరికరాలు రైతులకు అందించనుందని చెప్పారు. స్ప్రేయర్లకు మాత్రం కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే రాయితీ ఇవ్వనున్నట్లు చెప్పారు. వీటన్నింటికి కలిపి జిల్లాకు రూ.2.5కోట్లు ప్రభుత్వం రాయితీ ప్రకటించిందని తెలిపారు. జిల్లాలోని రైతులు వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు పొందేందుకు ఆయా మండలాల వ్యవసాయ అధికారుల ద్వారా దరఖాస్తులు పంపించాలన్నారు. అర్హులైన రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటా మన్నారు. జిల్లాకు మంజూరైన వ్యవసాయ పరికరాలను మండలాల వారీగా కేటాయింపులు చేశామని తెలిపారు. జిల్లాలోని రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



రైతుసేవా కేంద్రంలో రైతు విశిష్ట సేవా సంఖ్య నమోదు తెలుసుకుంటున్న జిల్లా వ్యవసాయ అధికారి వి.తారక రామారావు

గంగన్నపాడు రైతు సేవా కేంద్రం తనిఖీ

మండలంలోని గంగన్నపాడు గ్రామంలో గల రైతు సేవా కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి వీటీ రామారావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతు సేవా కేంద్రం ద్వారా జరుగుతున్న రైతు విశిష్ట సేవా సంఖ్య నమోదును పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. జిరాయితీ భూములు ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా రైతు విశిష్ట సేవా సంఖ్యను నమోదు చేయించుకోవాలని సూచించారు. ఆయనతో పాటు మండల వ్యవసాయ అధికారి జి.సునీల్‌కుమార్ ఉన్నారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹90	₹150	160

యువకుడిని కాపాడిన పోలీసులు

• ఆత్మహత్యకు పాల్పడతానని సూసైడ్ లెటర్ రాసిన యువకుడు



సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన యువకుడితో డీఎస్పీ శ్రీనివాస రావు, వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్

విజయనగరం క్రైమ్: ఆత్మహత్యకు పాల్పడతానని సూసైడ్ నోట్ రాసిన కేరళ యువకుడు విష్ణు కొయిత్తా పత్తాయా వెస్లీ (21) ఆచూకీని విజయనగరం టౌన్ పోలీసులు కనిపెట్టి డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు సమక్షంలో యువకుడిని బంధువులకు అప్పగించారు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. కేరళ రాష్ట్రంలోని కన్నూరు జిల్లాకు చెందిన విష్ణు కొయిత్తా పత్తాయా వెస్లీ బీఎస్సీ నర్సింగ్ చదివి బెంగళూరులోని ఒక కార్పొరేట్ ఆసుపత్రిలో వర్క్ చేస్తున్నాడు. ఒక యువతితో పరిచయం ఏర్పడి, ప్రేమకు దారితీసింది. ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తడంతో, యువకుడి ఫోన్ నంబర్‌ను సదరు యువతి బ్లాక్ చేసింది. దీంతో మనస్తాపం చెందిన యువకుడు విష్ణు అమ్మాయి ప్రేమను వదులుకోలేక తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నానని, తన మృతదేహాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరంలో ట్రేస్ చేసుకోవాలని సూసైడ్ లెటర్ రాసి, సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఈ పోస్టుతో అప్రమత్తమైన విష్ణు బంధువులు, స్నేహితులు సదరు విషయాన్ని నేరుగా విజయనగరం ఎస్పీకి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో ఆ యువకుడి ఆచూకీ కనిపెట్టి, రక్షించే చర్యలు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించిన మేరకు రంగంలోకి దిగిన వన్ టౌన్ సీఐ శ్రీనివాస్ తన బృందంతో టెక్నాలజీని వినియోగించి విశాఖపట్నం, చీపురుపల్లి, విజయనగరంలలో పలు ప్రాంతాల్లో గాలించి, చివరికి యువకుడి ఆచూకీని విజయనగరం రైల్వేస్టేషన్‌లో మార్చి 11న రాత్రి కనుగొన్నారు. వెంటనే ఆ యువకుడిని విజయనగరం వన్‌టౌన్‌కు తీసుకువచ్చి కౌన్సెలింగ్ నిర్వహించి బంధువులకు సమాచారం ఇచ్చారు. విష్ణు బంధువులు గురువారం రాగానే విజయనగరం డీఎస్పీ ఆఫీస్ లో డీఎస్పీ శ్రీనివాస్ సమక్షంలో అప్పగించారు. సకాలంలో స్పందించి, యువకుడి ఆచూకీ కనిపెట్టి, ఆత్మహత్య ఆలోచనల నుంచి కాపాడిన వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్, సిబ్బందిని డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్‌ను ఎస్పీ వకుల్ అభినందించారు. యువకుడ్ని కాపాడడంలో చొరవ చూపి, సమయానుకూలంగా అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేసిన ఎస్పీ వకుల్ జిందల్‌కు యువకుడి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.